# ఎక్కడిదీ శూన్యం?

– వారణాసి రామకృష్ణ

డిసెంబరు నెల. తెల్లవారుఝాము నాలుగు గంటల వేళ. ఎముకలు కొరికే చలి. అంత చలిలోనూ కృష్ణమూర్తి ఇంటినుండి స్కూటర్ మీద కొడుకుని కలుసుకోవటం కోసం బైలుదేరాడు.

కొడుకు సురేష్ సిటీలో కాలేజీలో చదువుతున్నాడు. కాలేజీవాళ్లే ఎమ్‌సెట్ కోచింగ్ కూడా ఇస్తారు. కోచింగ్ ఉదయం ఐదుగంటలకే ప్రారంభమవుతుంది. సురేష్ ఇంజనీర్ అయి అమెరికా వెళ్లి డాలర్లు సంపాదించాలన్నది కృష్ణమూర్తి ఆరాటం. కొడుకు కోచింగ్‌కి సరిగ్గా వెళ్తున్నాడో లేదోనని అతనికి అనుమానం! అందుకే అప్పుడప్పుడూ కొడుకు వుంటున్న అద్దెగది దగ్గరికి ఉదయాన్నే వెళ్లి అతను కోచింగ్‌కి వెళ్తున్నదీ లేనిదీ చెక్ చేస్తుంటాడు.

నాలుగు అంతస్థులు ఎక్కి కొడుకున్న గది చేరేసరికి కృష్ణమూర్తికి ఆయాసం వచ్చింది. రొప్పుతూనే గది తలుపు వంక చూసి గతుక్కుమన్నాడు. గదిలో కొడుకు లేడు. గదికి బైట తాళం వేసి వుంది. వెంటనే కొడుకు మీద పట్టలేనంత కోపం ముంచుకొచ్చింది. తను ఇంత కష్టపడి ఖర్చుచేసి చదువు చెప్పిస్తుంటే వీడుమాత్రం ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు.

కాస్సేపు తర్వాత మెల్లగా మెట్లుదిగి క్రిందికి వచ్చి రోడ్డుమీద నిలబడ్డాడు. ఇంతలోనే సురేష్ అతని ఫ్రెండ్ బైక్‌మీద వెనక కూర్చుని వచ్చాడు. అతనితోపాటు వచ్చిన కుర్రాడు సురేష్‌ని డ్రాప్ చేసి వెళ్లిపోయాడు.

కృష్ణమూర్తి ఆగ్రహంగా సురేష్‌ని చూస్తూ ''ఏరా...రాత్రంతా గదిలో లేవా?'' అడిగాడు.

''డాడీ! నిన్న జయంత్ బర్త్‌డే. రాత్రి సిన్మాకెళ్లాం. దాంతో లేటయ్యేసరికి వాళ్లింట్లోనే వుండిపొమ్మని అన్నాడు. రాత్రి వాళ్లింట్లోనే వున్నాను!''

''ఒరేయ్! నిన్న జయంత్ బర్త్‌డే. ఇవాళ మరొకడితో డిన్నర్ పార్టీ. నువ్విలా తిరుగుతూ చదువుని నిర్లక్ష్యం చేస్తుంటే ఎలారా?'' చిరాకుపడ్డాడు.

''డోంట్ వర్రీ డాడీ! నేనసలు ఈమధ్యకాలంలో బైటికే వెళ్లలేదు. దాదాపు సంవత్సరం క్రిందెప్పుడో సిన్మాకెళ్లానంతే. మళ్లీ ఈరోజే...'' చెప్పేలోగానే కృష్ణమూర్తి రోషంగా ''చాల్లే నోర్ముయ్! చేసిన వెధవ పనికి పైగా సమర్థింపులు. ఇలా అయితే నీకు ర్యాంకెలా వస్తుంది?'' కళ్లెర్రజేశాడు.

''చూడు డాడీ! నేను ఈరోజునుండి ఇంకా కష్టపడతాను. ర్యాంక్ తెచ్చుకుంటానన్న నామాట నిలబెట్టుకుంటాను.''

''మాటలు కాదురా! నీ తీరు మారాలి. నువ్వీ బర్త్‌డే పార్టీలు, షికార్లు మర్చిపోవాలి.''

''డాడీ! నేనేమైనా మిషననుకుంటున్నావా ఏంటి? రాత్రింబవళ్లు చదువుతున్నాను. ఏదో ఎప్పుడైనా కాస్త రిలాక్సవ్వాలని వుండదా?'' సురేష్ గొంతుపెంచి అన్నాడు.

''నువ్వు రిలాక్సవ్వాలని, సరదాగా సిన్మాలు చూడాలనీ అనుకుంటే ఇక్కడీ అద్దెగది, కాలేజీ డొనేషన్, కోచింగ్, ఫీజులు ఇవన్నీ ఎందుకురా దండగకి! మనింటికే పోదాం పద'' గట్టిగా అరుస్తూ చెప్పాడు.

'డాడీ చిన్న విషయం పెద్దది చెయ్యకు. రోడ్డుమీద వెళ్తున్నవాళ్లంతా మనల్నే చూస్తున్నారు. బాధ్యత గురించి నీకే కాదు నాకూ తెలుసు'' విసురుగా అనేసి గబగబా మెట్లెక్కి పైకెళ్లిపోయాడు సురేష్.

కృష్ణమూర్తి కోపం తగ్గలేదు. అసహనంగా ఇంటిదారి పట్టాడు. వస్తుంటే దారిలో అతనికి కొలీగ్ సుబ్బరాజు గుర్తొచ్చాడు. కొడుకు మీది కోపాన్ని అతనికి చెప్పుకుంటేకానీ మనసు శాంతపడదనిపించింది అతనికి.

సుబ్బరాజు ఇంటిగేటు దగ్గరికి రాగానే అతని కూతురు కల్యాణి బైటికి వెళ్తూ కనిపించింది. ''ఏమ్మా! కోచింగ్‌కేనా? ఎలా వుందమ్మా ప్రిపరేషన్?'' పలకరించాడు.

కల్యాణి ఇబ్బందిగా నవ్వేసి ''బానే వుంది అంకుల్'' అంటూ వేగంగా వెళ్లిపోయింది. లోపలినుండి సుబ్బరాజు కృష్ణమూర్తిని చూసి గేటు దగ్గరికి నడుస్తూ ''రావయ్యా...రారా! ఎక్కడ్నించి ఇంత ఉదయాన్నే?'' అంటూ ఆహ్వానించాడు.

''నీకేం సుబ్బరాజూ! ఆడపిల్ల తండ్రివి. విష్ణుమూర్తి



లాగా కాళ్లు బారజాపి పడుకున్నా ప్రాబ్లెం లేదు'' అన్నాడు.

కృష్ణమూర్తి ఆంతర్యం సుబ్బరాజుకి అర్థమయింది. ఆడపిల్లలకి కాలేజీ సీట్లలో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వటం అతనికి నచ్చని సంగతి. ఇదివరకూ చాలా సార్లు ఆ సంగతి మీద వాదించేవాడు.

సుబ్బరాజు నవ్వేస్తూ ''ఏంటి? పొద్దున్నే దండయాత్ర చేస్తున్నావు'' అన్నాడు.

''దండయాత్ర కాదు! దండగమారి యాత్ర చేసి

వస్తున్నాను'' అంటూ కృష్ణమూర్తి కొడుకు చదవటంలేదనీ షికార్లు తిరుగుతున్నాడని అన్నాడు.

సురేష్ తెలివితేటలు, కృష్ణమూర్తి ఆరాటం, అనవసర తాపత్రయం సుబ్బరాజుకి తెలిసిన విషయమే కనుక అతను తేలిగ్గా నవ్వుతూ ''ప్రతి చిన్నదానికీ వర్రీ అవకయ్యా! కుర్రాడు గట్టివాడే. ర్యాంక్ సంపాదిస్తాడు. అనవసరంగా తొందరపడి ఓ మాట అనకు'' అంటూ చెప్పడం పూర్తిచేసేలోపల కృష్ణమూర్తి కోపంగా సుబ్బరాజుని చూసి చరచరా బైటికి నడిచి స్కూటర్ స్టార్ట్ చేశాడు.



● ● ●

రిజల్ట్స్ వచ్చాయి. సురేష్‌కి స్టేట్ ర్యాంక్ వచ్చింది. అతని పేరు, ఫోటో పేపర్లో వేశారు. కృష్ణమూర్తి పట్టలేనంత ఉత్సాహంగా సంతోషంతో గంతులు వేశాడు.

సంబరపడుతున్న తండ్రిని సురేష్ ఎగాదిగా చూసి ''డాడీ! నేను కంప్యూటర్ బ్రాంచీలో చేరటంలేదు'' కూల్‌గా అన్నాడు.

కృష్ణమూర్తి కీ అయిపోయిన బొమ్మలా ఆగిపోయి ''అదేంట్రా అలా అంటున్నావు? కంప్యూటర్స్‌లో చేరి, ఆనక అమెరికా వెళ్లి...'' ఇంకా ఏదో చెప్పబోగా సురేష్ చెయ్యెత్తి ఆగు అన్నట్టు అభినయించి ''చూడు డాడీ! కంప్యూటర్స్ చదవటమొక్కటే గొప్ప విషయం కాదు! నాకు సివిల్ ఇంజనీరింగ్ అంటే చాలా ఇష్టం. ఆ బ్రాంచీలో చేరుతాను'' దృఢంగా చెప్పాడు.

కృష్ణమూర్తికి కోపం తన్నుకొచ్చింది. ''వెధవా! అందరూ కంప్యూటర్స్‌లో సీటు దొరక్క చస్తుంటే స్టేట్ ర్యాంక్ తెచ్చుకుని నువ్వేంట్రా ఆ దిక్కుమాలిన సివిల్‌లో చేరుతానంటావు?'' గట్టిగా కేకలు వేశాడు.

సురేష్ తండ్రిని సౌమ్యంగా చూస్తూ ''ఇక నన్ను ఒత్తిడి చెయ్యకండి. మీరు చెప్పినట్టే గత నాలుగు సంవత్సరాలుగా విన్నాను. నా ప్రతిభ నిరూపించాను. అయితే మీరనుకున్నట్టు కంప్యూటర్ బ్రాంచీలో చేరటానికి ర్యాంక్ తెచ్చుకోలేదు. కేవలం మీ అభిప్రాయాలు తప్పనీ, నా ప్రతిభ పట్టుదల మీకు తెలియాలని ఇంత కాలం ఓర్పు వహించాను. ఇకమీదట కేవలం నాకేది ఇష్టమో అదే చెయ్యాలని నిర్ణయించుకున్నాను'' అంటూ గదిలోకెళ్లి తలుపు వేసుకుని క్షణంలోపే మళ్లీ తలుపు తీసి తండ్రిని తిరిగి శాంతంగా చూస్తూ ''డాడీ! ఏదిఏమైనా నేను నాకు ఇష్టమైన పనులే చెయ్యాలని గట్టిగా డిసైడ్ చేసుకున్నాను. దయచేసి నాకు అడ్డుచెప్పవద్దు!'' మళ్లీ తలుపు మూసేశాడు.

కృష్ణమూర్తికి కోపం పెల్లుబికింది. ఇన్నాళ్లుగా పెట్టుకున్న ఆశల మీద వీడు నిప్పులు పోశాడు. ఇన్నాళ్లుగా పెంచుకున్న ఊహల మీద నీళ్లు పోశాడు.

స్కూటర్ బైటికి తీసి తిన్నగా సుబ్బరాజు ఇంటికొచ్చాడు. సుబ్బరాజు ఇంటిదగ్గర చాలా సందడిగా వుంది! ఆడవాళ్లు లోపలినుంచి బైటికొచ్చి మళ్లీ లోపలికి వెళ్తున్నారు.

బహుశా కల్యాణికీ మంచి ర్యాంకే వచ్చివుంటుంది. ఆమెని, సుబ్బరాజుని అభినందించటానికి వీళ్లంతా వచ్చుంటారు అనుకుంటూ కృష్ణమూర్తి ఇంట్లోకి వెళ్లాడు.

హాల్లో సుబ్బరాజు భార్య పెద్దపెట్టున శోకాలు పెడుతూ రోదిస్తోంది. చుట్టూ చేరిన స్త్రీలు కొందరు ఆమెని ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆమె

ఏడుపు ఆగటంలేదు.

కృష్ణమూర్తి నిర్ఘాంతపోయి అక్కడే నిలబడ్డాడు. ఇంతలో మరో గదిలోంచి సుబ్బరాజు బైటికొచ్చాడు. మనిషి జబ్బుపడి లేచిన పేషెంటులా నడుస్తూ వచ్చి కృష్ణమూర్తిని చూసి జీవంలేని నవ్వు నవ్వేడు.

కృష్ణమూర్తికేమీ అర్థంకాలేదు. తను ఊహించినది వేరు. ఇక్కడి సన్నివేశం వేరు!

సుబ్బరాజు అతని భుజం మీద చెయ్యి వేసి బైటికి నడిపించుకుని తీసుకుపోయాడు.

''ఏం జరగింది సుబ్బరాజు? కల్యాణికి మంచి ర్యాంక్ రాలేదా?'' కృష్ణమూర్తి ఆతృతగా అడిగాడు. సుబ్బరాజు నిర్లిప్తంగా చూసి ''అసలు పరీక్ష రాస్తేగ దయ్యా ర్యాంకు రావటానికి'' అన్నాడు.

''అదేంటి?'' కృష్ణమూర్తి నోరు అప్రయత్నంగా తెరిచాడు.

''కల్యాణి గత రెండేళ్ళుగా మమ్మల్ని మాయలో ముంచేసింది!''

''మాయలోనా?!''

''అవును! గత రెండేళ్ళుగా కోచింగ్ క్లాసులకి వెళ్ళనే లేదు! ఆ పేరు చెప్పి ఇంట్లోంచి బైటపడి వినోద్ వెంబడి పార్కులు, సిన్మాలు తిరిగింది!''

''వినోద్‌తోనా? వినోద్ అంటే మన కొలీగ్ మురళీధరం కొడుకే కదూ?''

''వాడే ఆ కుర్రాడే. ఇద్దరూ ప్రేమించుకున్నారట! రెండ్రోజుల క్రిందట ఇంట్లోంచి చెప్పకుండా వెళ్ళిపోయి పెళ్ళికూడా చేసుకున్నారు!''

''ఆ ..! పెళ్ళికూడా చేసుకున్నారా?''

''అంతా నా ఖర్మయ్యా కృష్ణమూర్తీ! ఇద్దరూ ఇల్లు అద్దెకి తీసుకున్నారట. ఆ ఇంటి అడ్రసు వివరాలు ఉత్తరం రాసి పంపింది! దానిమీద మాకేమాత్రం ప్రేమ, అభిమానం వున్నా అక్కడికి వచ్చి కలవమని రాసింది. ఒకవేళ కోపం వస్తే తను చచ్చిపోయాననుకొమ్మని రాసింది!''

వినగానే ఆతృత పట్టలేక ''మరిప్పుడు ఏం చెయ్యబోతున్నారు?'' కుతూహలంగా అడిగాడు.

''ఇక చేసేదేమీలేదు. వాళ్ళకిష్టమైన పని వాళ్ళు చేశారు. మన బాధ్యత మనం నెరవేర్చాలి!'' అది విని కృష్ణమూర్తి ఆశ్చర్యంగా ''అదేంటి సుబ్బరాజూ! నీకసలు కల్యాణి మీద కోపం రావటంలేదూ?'' అడిగాడు.

''ఇప్పుడు కోపం తెచ్చుకునే కంటే నా ధర్మాన్ని నేను నెరవేర్చటం ముఖ్యమైన విషయం కృష్ణమూర్తీ!''

ఆ మాటతో కృష్ణమూర్తికి ఉద్రేకం తన్నుకొచ్చి ''అట్లా అనకు! నాలుగు తన్ని ఆ వినోద్‌గాడ్ని తరిమేసి కల్యాణిని తీసుకొచ్చి గడప దాటకుండా చూడు!'' గట్టిగా అన్నాడు. కానీ సుబ్బరాజు ప్రశాంతంగా ''దానివల్ల సమస్య పరిష్కారమవుతుందా? మనం పెద్దవాళ్ళం! అన్నీ మనం ఆలోచించినట్టే జరగాలనుకుంటాం కానీ పిల్లల వైపునుండి ఆలోచించం! నిజానికి కల్యాణి తనకి ఆర్ట్స్ గ్రూప్ ఇష్టమని చెప్పినా నేనే వినకుండా దాన్ని ఇంజనీర్ని చెయ్యాలని ఎంపిసి గ్రూపులో చేర్పించాను'' అన్నాడు.

''నిజమే సుబ్బరాజూ! మంచిపనే చేశావు. పిల్లలు వాళ్ళకేం తెలుసు జీవితం గురించి? ఏదేదో ఊహిస్తారు కానీ వాస్తవాలు తెలీవు. వాటిని మనమే తెలియజెప్పాలి. వినకపోతే బలవంతంగానైనా దారిలో పెట్టాలి!''

''దానివల్ల ఉపయోగం లేదు కృష్ణమూర్తీ! తాత్కాలికంగా నీమాట నెగ్గుతుందేమో కానీ శాశ్వత ప్రయోజనం వుండదు. మనం మనకి తెలీకుండానే పిల్లలకి మనకి మధ్య శూన్యం సృష్టిస్తున్నాం. మనం చెప్పే విషయాలు వాళ్ళకి చేరవన్న సంగతి అర్థం చేసుకోకుండా అజ్ఞానంతో వాళ్ళు మన మాటలే వినాలని పదే పదే చెబుతుంటాం. కానీ ఆ మాటలన్నీ శూన్యప్రదేశంలోకి ప్రవేశించగానే ఆర్ద్రత కోల్పోయి బలహీనమైపోయి అక్కడే నిర్జీవమైపోతాయి. దీనికంటే వాళ్ళకేది అవసరమో, ఇష్టమో వాళ్ళవైపునుండి చూడటం మంచి పని!''

''అంటే వాళ్ళుచేసే ఈ దిక్కుమాలిన పనులన్నీ కరెక్టేనంటావు!''

''అవి నీకూ నాకూ దిక్కుమాలినవి కృష్ణమూర్తీ! వాళ్ళవరకూ వాళ్ళు కరెక్ట్! మన ఆలోచన మనకి కరెక్ట్! నీకింకో సంగతి చెప్పలేదు. కల్యాణి ఎల్ఐసీలో క్లర్క్ పోస్టుకి రిటన్ టెస్ట్ రాసి పాసయ్యింది! రేపో మాపో ఉద్యోగం వచ్చేలా వుంది. వినోద్ కూడా ఎక్కడో ప్రైవేటు జాబ్‌లో చేరాడట. దాని కాళ్ళమీద అది నిలబడగలనన్న ధీమా దానికుండబట్టి అదీ పని చేసింది! వాళ్ళు అన్నీ ఆలోచించుకుని వాళ్ళగురించి వాళ్ళు జాగ్రత్తలు తీసుకున్నాకే పెళ్ళి చేసుకున్నారు!''

కృష్ణమూర్తి నిశ్చేష్టుడై వినసాగాడు. అతనికి బుర్ర తిరుగుతున్నట్టు అనిపించింది. సుబ్బరాజు అతని చేతులు పట్టుకుని ''ఈ టైమ్‌లో కాస్త నీ సహాయం కావాలయ్యా! కల్యాణిని, వినోద్‌ని ఇంటికి తీసుకురావాలి. మేరేజ్ రిసెప్షనొకటి చెయ్యాలి!'' అడుగుతుంటే కృష్ణమూర్తి అయోమయంగా చూశాడు. చప్పున అతనికి కొడుకు గుర్తొచ్చాడు. వాడి తెలివి, చాకచక్యం, వాడి మాటలు గుర్తొచ్చాయి.

హఠాత్తుగా కృష్ణమూర్తికి కొడుకు మీద తొలిసారిగా ప్రేమ, అభిమానం పుట్టుకొచ్చాయి. శరీరం పులకరించింది.

''ఇంటికెళ్ళి మరో గంటలో వచ్చేస్తాను సుబ్బరాజూ!'' హడావిడిగా చెప్పి స్కూటర్ స్టార్ట్ చేశాడు కృష్ణమూర్తి.

★

## లక్షాధికారి కావాలనుకుంటున్నారా!

అకస్మాత్‌గా లక్షాధికారి కావాలనుకుంటున్నారా? అయితే దక్షిణకొరియా వెళ్దాం రండి. ఈమధ్య దక్షిణకొరియాలోని ఓ ప్రాంతంలో ఉన్న చిన్న పట్టణంలో నిధి నిక్షేపాలున్నాయని, డైమండ్స్ విపరీతంగా దొరుకుతున్నాయని తెలిసి ఆ చిన్ని పట్టణానికి అందరూ బయలుదేరుతున్నారట. ఇదివరలో కేవలం వందల సంఖ్య ఉండే ప్రజలు ఈ విషయం వెల్లడయిన వెంటనే లక్షలకొద్దీ జనాభా వచ్చి చేరుతున్నారట. రెండేళ్ళక్రితం ఎవరూ ఉండేవారు కాదట అక్కడ. ఇప్పుడు అక్కడ భూమిలో వజ్రాలు, వైఢూర్యాలు దొరుకున్నాయట విపరీతంగా. శ్రీలంక, థాయ్‌లాండ్, బల్గేరియా నుండి లక్షాధికారులు కావాలని అక్కడికి చేరుకుంటున్నారు. అక్కడి కొండచరియలు తవ్వుతూవుంటే వజ్రాలు వెలువడుతున్నాయి. రకరకాల రంగుల్లోవున్న ఈడైమండ్స్ అత్యధిక విలువకలిగి ఉంటాయట. కేవలం 20 మీటర్లలోతు తవ్వకానికే ఇవి బయటపడుతున్నాయట. ఇదంతా బాగానే వుందిగానీ, ఒకరికి దొరికి మరొకరికి దొరకకపోవడంతో తెగ కొట్లాటలు జరిగి అవి హత్యలకు దారి తీస్తున్నాయట. విపరీతమైన దొంగతనాలు మొదలయ్యాయట. అంతేకాదు ఈజీగా డబ్బు వస్తుండటంతో తాగుడు మొదలెట్టారట అక్కడి ప్రజలు. అంతేకాదు వజ్రాలు విలువకట్టే వర్తకులు మోసం చేస్తున్నారట. ఏదిఏమైనా ఆకస్మికంగా ధనవంతులు కావాలంటే అక్కడికి వెళ్ళాల్సిందే!

- రాజీ

